# లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లు కావాలి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- 4వ విడత ఆసరా కింద రూ.7.41 కోట్ల పంపిణీ



మోపిదేవిలో ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

**మోపిదేవి:** లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లుగా మారి జగనన్నను మళ్లీ గెలిపించి ముఖ్యమంత్రిని చేయాలని అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో నాలుగవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తూ పేదవర్గాలకు అండగా జగనన్న నిలిచారని చెప్పారు. ప్రతిపక్షాలు అభివృద్ధి లేదనటం సరికాదని, గ్రామాల్లోకి వచ్చి చూస్తే సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, నాడు–నేడు పాఠశాలల అభివృద్ధి కంటికి కనపడతాయన్నారు. సాగునీటి సమస్య లేకపోవడం వల్ల రైతులు పంటలు బాగా పండించారని, కొన్నిచోట్ల ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడి వచ్చిందని తెలిపారు. పేదలకు అండగా నిలిచిన జగనన్నను ఓడించడానికి ధనిక వర్గాలంతా ఏకం అవుతున్నారని, అదే జరిగితే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ దివంగతనేత డాక్టర్ వైఎస్సార్ లాగానే ఆయన తనయుడు జగనన్న కూడా అన్ని పథకాలు పేద వర్గాలకే అందిస్తున్నారని తెలిపారు. యువనేత సింహాద్రి వికాస్ మాట్లాడుతూ మీ కుటుంబానికి న్యాయం జరిగితేనే నాకు ఓటేయమని అడిగే ముఖ్యమంత్రి దేశంలో జగనన్న ఒక్కరే అన్నారు. డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ నాలుగవ విడత ఆసరా కింద మండలానికి 708 ఎస్‌హెచ్‌జీ గ్రూపులలో 7,108 మంది అక్కాచెల్లెమ్మలకు రూ.7,41,27,046 విడుదలైనట్లు తెలిపారు. తొలుత దివంగతనేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభించారు. చివరగా డ్వాక్రా సంఘం మహిళలు ముఖ్యమంత్రి జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికపాటి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి. జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, ఎస్సీసెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

**మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి**



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగకుమారి

**పెడన:** రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి తెలిపారు. కౌన్సిల్ హాలులో బుధవారం ఉదయం చైర్‌పర్సన్ నాగకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలోని పది అంశాలు చర్చకు రాగా వాటన్నింటినీ ఆమోదించారు. తొలుత మూడో అంశంలో ఆశీలు వసూళ్ల విషయంలో లారీలకు సంబంధించి అశోక్ లేలాండ్ లేదా బొలెరాలకు రూ.100, 16 టైర్ల లారీకి రూ.400, 14 టైర్ల లారీకి రూ.350 వసూలు చేసేలా కొత్త గజిట్‌లో పెట్టాలని కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చారు. అయితే జనసేన కౌన్సిలర్ శివపావని అభ్యంతరం తెలియజేస్తూ డీసెంట్ ఇస్తామని చెప్పారు. అయితే ఇది మున్సిపల్ ఆదాయం పెంచుకోవడానికేనని, ఇందులో ఎవరి స్వార్థం లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. తాగునీటి సమస్యపై 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు మాట్లాడుతూ పట్టణంలో వాటర్ ప్లాంట్లు ఇష్టానుసారంగా నడుస్తున్నాయని, వాటికి సంబంధించిన లైసెన్సులు రెన్యూవల్ అయిందీ లేనిదీ ఎవరు చూస్తారని, తాగునీటి పరీక్షలు ఎవరు చేస్తారని ప్రశ్నించారు. కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా ఇప్పటికే వాటర్ హెడ్ వర్క్స్‌ను పరిశీలించామని, కొన్నిటికి రిపేర్లు ఉన్నాయని, వాటిని సరిచేయాల్సి ఉందని స్పష్టం చేశారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య పరిరక్షణే సీఎం జగన్ ధ్యేయం



44వ డివిజన్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

**మచిలీపట్నంటౌన్:** రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని 42, 44 డివిజన్లలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను పర్యవేక్షించిన మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఇబ్బంది పడకుండా మంచి మందులు పంపిణీ చేసి వారి ఆరోగ్యాలను పరిరక్షించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశిబిరాల్లో ఈసీజీ, కంటి, రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పర్యటనలో మేయర్ వెంకటేశ్వరమ్మతో పాటు డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్ చీలి రుచిత, 44వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మామిడిబత్తుల అజయ్ ఉన్నారు.

# వడ్డీ సహా అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాలి

**చిలకలపూడి(మచిలీపట్నం):** వినియోగదారునికి వడ్డీతో సహా అడ్వాన్స్ రూపంలో పంపిన మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల బుధవారం తీర్పు చెప్పారు. బంటుమిల్లి మండలానికి చెందిన బొర్రా అజయ్‌బాబు, బొర్రా అమని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి పంట పొలాల నిమిత్తం ఎరువులను బుక్ చేసి రూ.1,80,000, రూ.1,00,000 వరుస క్రమంలో అడ్వాన్స్ రూపంలో చెల్లించారు. కోరమండల్ కంపెనీ వారం రోజుల్లో ఎరువులు సరఫరా చేస్తామని చెప్పి సీజన్ అయిపోయినప్పటికీ ఎన్నిసార్లు అడిగినా ఎరువులను పంపలేదు. డబ్బులు వాపస్ ఇవ్వలేదు. దీంతో వీరు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు విచారించిన అనంతరం అడ్వాన్స్‌గా చెల్లించిన రూ.2,80,000 తో పాటు 2023 నవంబరు 15వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో వినియోగదారునికి చెల్లించాలని, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.25 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు తీర్పు వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా చెల్లించాలన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలించిన మేయర్



**మచిలీపట్నంటౌన్:** నగరంలోని 44వ డివిజన్ రుస్తుంబాద మునిసిపల్ పార్కులోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరును మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ బుధవారం పరిశీలించారు. పాఠశాలలోని వంటశాలలో తయారుచేసిన వంటలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు గోరుముద్ద పథకంలో భాగంగా తయారుచేసిన కూరగాయలతో కూడిన అన్నం, కుర్మా, కోడిగుడ్డు, చిక్కీలను వడ్డన చేశారు. ఈమెతో పాటు డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి విద్యార్థినులకు వడ్డన చేశారు.

## వ్యాయామ ఉపాధ్యాయునికి సన్మానం



**మోపిదేవి:** మూడు దశాబ్దాల పాటు వ్యాయామ ఉపాధ్యాయునిగా సేవలందించిన కట్టా వెంకట సత్యనారాయణను బుధవారం ఘనంగా సన్మానించారు. సత్యనారాయణ మోపిదేవి గురుకుల పాఠశాలలో పీడీగా చేస్తూ రిటైరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్ఐఎస్ గురుకులాల రాష్ట్ర సెక్రెటరీ ఎ.కృష్ణ మోహన్ మాట్లాడుతూ వృత్తిలో ఎంతో మందిని ప్రభావితం చేసిన పీడీ క్రమశిక్షణలోనూ విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు.

## వాలీబాల్ క్రీడాకారులకు కిట్లు పంపిణీ



**కోడూరు:** ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా జిల్లా స్థాయికి ఎంపికైన వాలీబాల్ క్రీడాకారులకు దాతలు కిట్లు పంపిణీ చేశారు. మండలంలోని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన యువకులు రమేష్, శరత్‌రాజు, సాయి, రాము, బాబీ, రాజీవ్, గోపీనాథ్ జట్టుగా ఏర్పడి వాలీబాల్ ఆటలో జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రోత్సహిస్తూ గ్రామానికి చెందిన సిద్ధినేని దినేష్, రామాంజనేయులు, దారపురెడ్డి జగదీష్, కొప్పనాతి శివాజీ, దుట్టా సామిత్ రూ.18వేలు విలువ చేసే స్పోర్ట్స్ డ్రస్, షూ, జర్కిన్, వాలీబాల్స్‌ను క్రీడాకారులకు అందించారు.

# సీఎం నిర్ణయాలతో సత్ఫలితాలు



వేమూరి లావణ్యను సన్మానిస్తున్న ఈఓఆర్డీ అశోక్

**చల్లపల్లి:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయాలతో సత్ఫలితాలు లభిస్తున్నాయని ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్ అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం–1లో మహిళా పోలీస్ వేమూరి లావణ్యకు ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ, లక్షలాది మంది ఉద్యోగుల నియామకంతో గ్రామ స్థాయిలో ప్రభుత్వ సేవల వ్యవస్థ బలోపేతమైందన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో చురుకైన సేవలు అందించిన గ్రామ సచివాలయ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, పీఈటీలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీని కలిసిన చేనేత సంఘ నేతలు

**పెడన:** ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టో కమిటీలను ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ సంఘ నాయకులు కలిసి చేనేత సమస్యలపై వినతిపత్రం అందజేసినట్టు ఆ సంఘ ప్రతినిధి బృందం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఉన్న వారిని వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బండారు ఆనంద ప్రసాద్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాం ప్రసాద్, ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, బీజేపీ చేనేత విభాగం రాష్ట్ర కో– కన్వీనర్ వాసా పల్లపరాజు కలిశారు. జాతీయ స్థాయిలో చేనేత పరిరక్షణ కోసం, చేనేత కళాకారుల సంక్షేమం కోసం, సమస్త చేనేతలకు సమన్యాయం కోసం వివిధ రాజకీయ పార్టీల మేనిఫెస్టో కమిటీలను కలిసి చేనేత అంశాలపై ప్రతిపాదనలు సమర్పిస్తున్నట్టు ఆనందప్రసాద్ చెప్పారు. కాంగ్రెస్ నాయకులు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా

**ఆశీర్వదించాలని కోరిన ఉప్పాల రమేష్(రాము)**



20వ వార్డులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి రాము

**పెడన:** తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే పెడన నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నిలుపుతానని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. స్థానిక 8వ నంబరు సచివాలయం పరిధిలోని 20, 21వ వార్డులు, 2వ సచివాలయం పరిధిలోని 4, 5, 6 వార్డులకు చెందిన పార్టీ శ్రేణులు, గృహసారథులు, వలంటీర్లు, స్థానికులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి మూడో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించడానికి ఏలూరులో సిద్ధం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి పెడన నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లి ఆయనకు మద్దతు తెలియజేద్దామని పిలుపునిచ్చారు.

**ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తా**

వర్షం వస్తే ప్రధానంగా 20, 21వ వార్డులు ముంపుబారిన పడుతున్నట్లు తన దృష్టిలో ఉందని, ఈ సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. సొంత మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికునికి నేతన్న నేస్తం ద్వారా ఇప్పటికే నాలుగు విడతలుగా ప్రభుత్వం రూ.96వేలు చొప్పున అందజేసిందన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలుచేస్తున్న ప్రతి సంక్షేమ పథకం తిరిగి పొందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఆయా సమావేశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, కొసనం కరుణకుమారి, పిచ్చిక సతీష్‌బాబు, బాబూలాల్, రెహతున్నీసా, పార్టీ నాయకులు, సమన్వయకర్తలు, గృహసారథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

**చిలకలపూడి(మచిలీపట్నం):** మహిళా, శిశు సంక్షేమ సాధికారత కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సాధికారత అధికారి ఎస్.సువర్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మిషన్ శక్తి ద్వారా గొడుగు పథకం, ఉప పథకం 'సంబల– సామర్థ్య'లో కాంట్రాక్టు పద్ధతిన సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, కేస్ వర్కర్ పోస్ట్, పారా లీగల్ పర్సనల్, పారా లీగల్ మెడికల్ పర్సనల్, మానసిక, సామాజిక సలహాదారు, ఆఫీస్ అసిస్టెంట్, కుక్, సెక్యూరిటీ గార్డు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్‌లో ఖాళీ పోస్టుల వివరాలు పొందుపరిచామని, ఫిబ్రవరి 9వ తేదీలోగా కానూరులోని తమ కార్యాలయానికి దరఖాస్తులను పంపాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 79015 97290, 99493 31320 నంబర్లను సంప్రదించాలన్నారు.

# కమిషనర్ చంద్రయ్య సేవలు మరువరానివి



చంద్రయ్యను సత్కరిస్తున్న పేర్ని కిట్టు

**మచిలీపట్నంటౌన్:** మచిలీపట్నం నగర కమిషనర్ జి.చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిలక్ష్మి అందించిన సేవలు మరువరానివని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా చంద్రయ్య, జ్యోతిలక్ష్మి బదిలీ కావటంతో వారిద్దరికీ బుధవారం రాత్రి కౌన్సిల్ హాలులో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ చంద్రయ్య, జ్యోతిలక్ష్మి నగరాభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు పాల్గొని వారిద్దరి సేవలను కొనియాడారు. అనంతరం చంద్రయ్య, జ్యోతిలక్ష్మిలను గజమాలలతో ఘనంగా సత్కరించారు.

## సొర్లగొందిలో 91.6 శాతం కులగణన సర్వే పూర్తి

**సొర్లగొంది(నాగాయలంక):** మండలంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ముమ్మరంగా కొనసాగుతున్న కులగణన సర్వే పనితీరును మండల విస్తరణాధికారి కె.అప్పలనరసమ్మ బుధవారం పరిశీలించారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఈ కార్యక్రమం ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతుందని ఆమె చెప్పారు. ఇప్పటివరకు 91.6 శాతం కుటుంబాల్లో సర్వేతో 40,713 మంది కులగణన వివరాలు నమోదు అయినట్లు వివరించారు. మండలంలో కేవలం 1439 కుటుంబాల కులగణన మాత్రమే సేకరణ చేయాల్సి ఉందన్నారు. వీఆర్వో పెండ్యాల చంద్రం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన

**చిలకలపూడి(మచిలీపట్నం):** ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని మచిలీపట్నంలోని విజయానంద కళాశాల విద్యార్థులు సందర్శించారు. తొలిసారిగా ఓటు వేసే వారికి ఓటు హక్కు వినియోగించుకోవటం, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ఓటర్ల జాబితాలో పేర్లను పరిశీలించుకోవటం, ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానం తదితర విషయాలపై వారికి అవగాహన కల్పించారు.

## నేడు మోపిదేవి జెడ్పీ పాఠశాల 75వ వార్షికోత్సవం

**మోపిదేవి:** మోపిదేవి జెడ్పీ పాఠశాల 75వ వార్షికోత్సవం ఫిబ్రవరి 1వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి తెలిపారు. ఉదయం 9 గంటలకు గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి జాతీయ పతాకావిష్కరణ చేసి కార్యక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో అవనిగడ్డ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు, జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఎంపీ బాలశౌరి, ఎంఎల్‌సీలు టి.కల్పన, కేఎస్ లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావుతో పాటు ఎంపీపీ రావి దుర్గావాణి, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు పాల్గొంటారని తెలిపారు. పూర్వ విద్యార్థులు అందించిన విరాళం రూ.1,50,016తో సోలార్ ఎక్విప్‌మెంట్‌ను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం జయంతి వివరించారు.

## ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించిన విద్యార్థులు

**గూడూరు:** నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికై మల్లవోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు పి.మోనిషా, బాల పల్లవి సుజిమ్మ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.అరుణ తెలిపారు.

## రైతుబజారులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మచిలీపట్నంటౌన్:** నగరంలోని రైతుబజారులో రూ.28 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) బుధవారం శంకుస్థాపన చేశారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతిలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబజారులో కొనుగోలుదారులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువచ్చి విక్రయించే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కంచర్లపల్లి విజయసారథి, డైరెక్టర్లు, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ అమీర్ పాల్గొన్నారు.

## తాగునీటి చెరువులను నింపండి



**కృత్తివెన్ను:** ప్రస్తుతం పంటకాలువ ద్వారా నీటి సరఫరా జరుగుతోందని, తాగునీటి చెరువులను నింపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గరుడప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని సీతనపల్లి మెగా రక్షిత మంచినీటి చెరువుకు బుధవారం మోటార్ల ద్వారా నీటిని తోడుతుండగా ఎంపీపీ గరుడప్రసాద్, ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మి పరిశీలించారు. మొత్తం 10 విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని తోడుతున్నామని, రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు వివరించారు.

## ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

**మచిలీపట్నం:** శారదానగర్ ఆర్సీఎం విచారణ చర్చిలో సాగరమాత మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఖమ్మం డయాసిస్ బిషప్ ఎమెరిటూస్ మైపాన్పాల్ ప్రత్యేక దివ్యబలిపూజను సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు. శారదానగర్ సాగరమాత విచారణ గురువు జానీ డిక్రూస్, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మందికి పైగా విచారణ గురువులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ను బిషప్ ఆశీర్వదించారు. అనంతరం బిషప్‌ను విచారణ గురువులు ఘనంగా సత్కరించారు. సాగరమాత విచారణ పరిధిలోని శారదానగర్, చిన్నాపురం, రుద్రవరం, పెదయాదర, కాలేఖాన్‌పేట, వాడగొయ్యి, సింహాచలం గ్రామస్తులు హోలీ క్రాస్ చర్చి, నిర్మల కాన్వెంట్ సిస్టర్లు పాల్గొన్నారు.

## చల్లపల్లిలో వైఎస్సార్ సీపీ సంబరాలు



**చల్లపల్లి:** మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటనతో చల్లపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుల సంబరాలు మిన్నంటాయి. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకటించిన ఐదో జాబితాలో మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దివంగత సింహాద్రి సత్యనారాయణ కుమారుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును నియమించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి స్థానిక ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులిద్దరినీ అఖండ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల యూత్ కన్వీనర్ వెనిగళ్ల తారక జగదీష్, వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి పఠాన్ కరిముల్లా ఖాన్, సీనియర్ నాయకులు వేమూరి గోవర్ధనరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, పాగోలు మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## క్లుప్తంగా

### ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**చిలకలపూడి(మచిలీపట్నం):** కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ రాజాబాబు తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నెలవారీ తనిఖీల్లో భాగంగా గోడౌన్ సీళ్లను పరిశీలించారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ల్యాండ్ స్కేప్ డెవలప్‌మెంట్ పనుల్లో భాగంగా మెరక పనులు పరిశీలించారు. కలెక్టరేట్ ఆవరణ చుట్టూ జరుగుతున్న పనులను ఆయన వాహనంలో తిరిగి పరిశీలించారు. సందర్శకులకు అవసరమైన టాయిలెట్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారి మెండు సురేష్, డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ శ్యామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ అస్మి



**చిలకలపూడి(మచిలీపట్నం):** జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను ఎస్పీ అద్నాన్ నయిమ్ అస్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఆమె చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతలు, న్యాయపరిపాలనకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

### ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వృద్ధులకు సాయం



**నాగాయలంక:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్థానిక సబ్ బ్రాంచ్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆశ్రమంలోని వృద్ధులకు బియ్యం, కూరగాయలు, పండ్లు పంపిణీ చేశారు. ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యుడు మద్ది వీరరాఘవయ్య(మెరుపు నాయుడు)పుట్టినరోజు పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. శివవిష్ణు చేతుల మీదుగా వీటిని ఆశ్రమ నిర్వాహకుడు టి.లీలామనోహర్, వృద్ధులకు అందజేశారు. రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యుడు యర్రంశెట్టి నాగపవన్, మిత్రబృందం సభ్యులు తుంగల చరణ్, పొన్నూరు భాను తదితరులు పాల్గొన్నారు.

### దానాల్లో అన్నదానం గొప్పది



**పెడన:** దానాల్లో అన్నదానం చాలా గొప్పదని పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం కృష్ణాజిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ఒక రోజు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ప్రసాద్ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు భోజనం వడ్డన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నాగకుమారి మాట్లాడుతూ కళాశాలలో 51 రోజులుగా దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం కార్యక్రమం నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొసనం కరుణ కుమారి, బాబూలాల్, పట్టణ సచివాలయాల కన్వీనర్ మతిన్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, లైబ్రేరియన్ పేరిశెట్టి నాగరవి తదితరులు పాల్గొన్నారు.

### 3న నాగాయలంకలో ఆసరా చెక్కుల పంపిణీ

**నాగాయలంక:** ప్రభుత్వం డీఆర్‌డీఏ–డాక్టర్ వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో విడుదల చేసిన నాలుగో విడత ఆసరా పథకం నిధులకు సంబంధించిన చెక్కుల పంపిణీ ఫిబ్రవరి 3న నాగాయలంకలో లబ్ధిదారులకు అందిస్తామని మండల వెలుగు ఏపీఎం కె.వై.దాసు బుధవారం తెలిపారు. రేమాలవారిపాలెంలోని నాగాయలంక మార్కెట్ యార్డులో ఉదయం 10 గంటలకు జరిగే సభలో స్థానిక ఎంఎల్ఏ సింహాద్రి రమేష్‌బాబు వీటిని పంపిణీ చేస్తారని చెప్పారు.